క్లుప్తంగా

తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

తిరుచానూరు(చంద్రగిరి): సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ముండ్లపూడిలో శనివారం ఒక వ్యక్తి తన నివాసంలో పూజలు చేస్తుంటే, కొంతమంది క్షుద్ర పూజలు చేస్తున్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు తెలిపారు. తిరుచానూరు పోలీసులు గ్రామానికి వెళ్లి ఆ వ్యక్తిని విచారించగా ఇంటికి వాస్తు దోషాలు ఉండడంతో అమావాస్య రోజున నవగ్రహ శాంతి పూజలు చేయించుకున్నట్టు చెప్పాడని వివరించారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



తిరుపతి గాంధీ రోడ్డు: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం బీజేపీ నాయకులు జరుపుకున్నారు. పెద్ద కాపు వీధిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశానికి రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్ రెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్, రాజా, కేశవరెడ్డి, సురేష్ స్వామి పాల్గొన్నారు.

వీనులవిందు చేసిన అన్నమయ్య సంకీర్తనలు

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నాదనీరాజనం వేదికపై ప్రముఖ కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ కొత్తగా వెలుగులోకి తీసుకువచ్చిన అన్నమయ్య సంకీర్తనలను ప్రముఖ సంగీత దర్శకులు స్వరపరిచి భక్త కోటికి అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చెన్నైకి చెందిన గాయత్రి నారాయణ, హైదరాబాద్‌కు చెందిన ఫణి నారాయణ, నేమని పార్థసారథి సుమధురంగా కీర్తనలను ఆలపించారు.

ఆధ్యాత్మిక రచనల పఠనంతో మానసిక పరివర్తన

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక రచనల పఠనంతో మానసిక పరివర్తన కలుగుతుందని ఆచార్య కె.సర్వోత్తమరావు తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం ప్రముఖ రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు రచించిన యోగక్షేమం వహామ్యహం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యోగక్షేమం వహామ్యహం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందజీ, గరికపాటి రమేష్‌బాబు, రాజాచంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జె.రాజాచంద్ర, కోడూరు సుమన, సాకం నాగరాజు, ఏ.మల్లేశ్వరరావు, పీసీ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాపాడుకోవాలి

తిరుపతి కల్చరల్: రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి దావలె తెలిపారు. తిరుపతిలోని ఓ ప్రయివేటు భవన్‌లో ఆదివారం యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి మహిళా సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులుగా పిల్లలందరికీ సమానం అనే భావన పెంపొందించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు ఎం.సంయుక్త మాట్లాడుతూ మహిళలు ఉద్యమంలోకి రావడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, పద్మావతి మహిళావర్సిటీ ప్రొఫెసర్ కె.మధుజ్యోతి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. టీటీడీ గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంతోపాటు తిరుమలలోని కల్యాణ వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఫల పుష్ప ప్రదర్శనశాల, పురాణ ఘట్టాలు, పూలతో తీర్చిదిద్దిన ప్రతిమలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి







ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గణపతి హోమంలో పాల్గొన్న చైర్మన్, సభ్యులు, అర్చకులు



బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో బాదూరమ్మ, పుట్టాలమ్మ

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో గణపతి పూజ చేసి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో గణపతి హోమం చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని దీక్షాబంధన అలంకరణ లో, మూలవిరాట్‌ను చీరల అలంకరణలో కొలువుతీర్చారు.

బాలాత్రిపుర సుందరిదేవిగా బాదూరమ్మ

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరులో బాదూరమ్మ, పుట్టాలమ్మ బాలా త్రిపుర సుందరిదేవి అంకరణలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో చేపట్టిన వారణా వ్రతం ఆకట్టుకుంది. ఉభయదారులుగా కురివికుప్పం వెంకటేశ్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అలాగే సూరావారిపల్లి సమీపంలోని సురభి గో సంరక్షణశాలలో ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి గోపూజ, దీపోత్సవం, కలశ స్థాపనతో శారదా నవరాత్రులకు అంకురార్పణ చేశారు. గ్రామస్తులు మోహన్‌రెడ్డి, చెంగ్రాయరెడ్డి, మునిక్రిష్ణారెడ్డి, హరి పాల్గొన్నారు.

నేటి నుంచి చంద్రగిరిలో నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈవో సి.ఆర్.తిమ్మారెడ్డి తెలిపారు. సోమవారం శ్రీలక్ష్మీ, 17న గజలక్ష్మీ, 18న అన్నపూర్ణ, 19న నారాయణి, 20న సరస్వతి, 21న గాయత్రి, 22న రాజరాజేశ్వరి, 23న దుర్గా దేవి, 24న మహిషాసుర మర్ధిని అలంకరణలతో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్టు తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని తిరుపతి గంగమ్మ, శ్రీమాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. అదేవిధంగా ఎర్రావారిపాళెం మండలంలోని తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

మలబార్‌లో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభం



తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఆధునాతన, సరికొత్త డిజైన్ల ఆభరణాలు, రోజూ ధరించే నగలు, వివాహ, లైట్ వెయిట్, పురుషులు, ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కచ్చితమైన తయారీ, పాదర్శక ధరల పట్టీతోపాటు ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు వంద శాతం విలువ, బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు, వంద శాతం బీఐఎస్ హాల్ మార్క్‌తో ధ్రువీకరణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

పోరాటాలకు సిద్ధంకండి

తిరుపతి కల్చరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాక్రిష్ణ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్న హోజన కార్మిక సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇస్కాన్ భోజనం వడ్డించే కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యూనిఫామ్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

శుభశ్రీ వస్త్రాలయం ఫెస్టివల్ సేల్ ఆఫర్స్



తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం వీవీ మహల్ రోడ్డులోని శుభశ్రీ వస్త్రాలయంలో నవరాత్రుల సందర్భంగా ఫెస్టివల్ సేల్ ఆఫర్లు 10 శాతం వరకు కల్పిస్తున్న షోరూం మేనేజింగ్ డైరెక్టర్ ఓంప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఆకర్షణీయమైన కలెక్షన్స్‌తో అందరికీ అందుబాటు ధరలతో వస్త్రాలు లభిస్తాయని తెలిపారు. కాంచీపురం పట్టు, డిజైనరీ శారీస్, ప్యూర్ టస్సర్ సిల్క్ శారీస్, బెనారస్, అన్‌స్టిచ్డ్ సూట్స్, సల్వార్స్, కుర్తీస్ తదితర అనేక వస్త్రాలు నూతన డిజైన్లలో ఉన్నాయని పేర్కొన్నారు. దసరా సందర్భంగా ఈనెల 24వ తేదీ వరకు కల్పిస్తున్న ఫెస్టివల్ సేల్ ఆఫర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఊపిరితిత్తుల్లో క్యాన్సర్‌కు అరుదైన చికిత్స



ఆపరేషన్ అనంతరం కోలుకుంటున్న రోగితో వైద్యుల బృందం

తిరుపతి తుడా: తిరుపతిలోని మారుతి ఆసుపత్రిలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ గడ్డను స్టంట్ ద్వారా తొలగించి రోగిని సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ నరసింహ విలేకరులతో మాట్లాడుతూ రాపూరుకు చెందిన పేరయ్య (53) ఊపిరితిత్తుల సమస్యతో ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. ఎడమ పక్క ఊపిరితిత్తిలోని నాళంలో క్యాన్సర్ గడ్డ వల్ల పూర్తిగా మూసుకుపోయిందని గుర్తించామన్నారు. లేజర్‌తో గడ్డను తొలగించి బెలూన్ బ్రంకోప్లాస్టీ అనే ఆధునిక పద్ధతి ద్వారా మూసుకుపోయిన ఊపిరితిత్తులను తెరిచి సెల్ఫ్ సమ్స్ అనే స్టంట్‌ను అమర్చి శ్వాస మార్గాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చామని తెలిపారు. ఈ అరుదైన చికిత్స ముంబయి, హైదరాబాద్ తర్వాత తొలిసారి తిరుపతిలోనే చేశామని తెలిపారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ మారుతి కృష్ణ మాట్లాడుతూ ఊపిరితిత్తులకు స్టంట్ ద్వారా అరుదైన చికిత్స అందించడం తమ ఆసుపత్రిలో తొలిసారి చేసినట్లు చెప్పారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తేజోరావ్, బిజినెస్ మేనేజర్ జాన్ చౌదరి పాల్గొన్నారు.

18న కడపలో రాష్ట్ర సదస్సు

తిరుపతి కల్చరల్: కృష్ణా జలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తోందని, దీనిపై 18న కడపలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. ఆయన ఆదివారం సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న ఆలోచనతో కృష్ణా జలాల పునః పంపిణీపై మోదీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. బచావత్ చట్టం ప్రకారం 81 టీఎంసీల నీటిని ఏపీ, తెలంగాణకు కేటాయించారని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల నీటిని కేటాయించారని గుర్తు చేశారు. దీన్ని మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, ఈ నేపథ్యంలో 18న కడపలో తలపెట్టిన రాష్ట్ర సదస్సుకు తరలి రావాలన్నారు.

వారపు సంతలో అన్నదానం

చంద్రగిరి: స్థానిక వారపు సంతలో వ్యాపారులు, రైతన్నలకు ఆదివారం తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు అన్నదానం చేశారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు సుమారు 400 మందికి అన్నదానం చేసినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు.

శైలపుత్రీ.. నమోస్తుతే..

శ్రీకాళహస్తి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కనకదుర్గమ్మ శైలపుత్రిగా, బొమ్మల కొలువులో ఏర్పాటు చేసిన జ్ఞానప్రసూనాంబ శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు.

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి






ఘనంగా దాండియా, గర్బ ఉత్సవాలు



తిరుపతిలోని మార్వాడీలు ఆదివారం దాండియా, గర్భ పేరుతో ఒక హోటల్‌లో ఉత్సవాలు జరుపుకున్నారు. ఇందులో రాజస్తాన్ కాసోమో క్లబ్, శ్రీసాయి అంబా సేవ మన్డల్ ఆధ్వర్యంలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అలాగే మహిళలు, యువతీ యువకులు, తిరుమల బైపాస్ రోడ్డులోని తులిప్ హోటల్, ఇస్కాన్ ఆలయంలో సంబరాలు జరుపుకున్నారు.